# మనిషి కోరేది

"అదేమిటిరా అన్నయ్యా! అలా మెట్ల మీద కూర్చున్నావేమిటి? వదిన లేదా?" అంటూ మెట్లెక్కి వచ్చిన చెల్లెలివైపు దీనంగా చూస్తూ –

"ఇక్కడ కాకపోతే ఎక్కడ కూర్చోమంటావే చేతనా! నా బతుకెలాగుందో చూడు. ఇదిగో ఇలాగే వుంది. మీ వదిన ఫ్రెండెవత్తోట ఊరినుంచొచ్చింది. ఆవిడని ఈవిడగారు మార్కెట్‌కి తిప్పడానికి తీసుకెళ్ళింది. ఎప్పుడొస్తుందో ఆ దేముడికే తెలియాలి. ఓ గంటనుంచి నా పని ఇంతే, ఈ మెట్లే నాకు గతి" అంటూ చెల్లెలి ప్రశ్నకి సమాధానం ఇస్తున్న సుకుమార్ అప్పుడే వచ్చిన శ్రావణి చెవిని పడకపోలేదు. కానీ విననట్లే మెట్లెక్కి ఇంటి తాళంతీసి లోపలికి ప్రవేశించింది. వెనకే భర్తా, ఆడబిడ్డా వచ్చారు.

"పాపం అన్నయ్య గంట నుంచి ఈ మెట్లమీద ఉక్కలో కూర్చున్నాడుట వదినా! తాళాలు పక్కింట్లోనన్నా ఇచ్చి వుండవలసింది.

"అయినా ఊళ్ళోకొచ్చిన వాళ్ళందర్నీ బజార్లూ, ఊళ్లూ తిప్పడానికి మనమేం నౌకర్లమా? గైడ్లమా? మన లాంటి వాళ్ళకి భర్తా, సంసారం ముఖ్యమా, ఊళ్ళో తిరుగుళ్ళా?'' అంటూ సాధిస్తున్న ఆడబిడ్డకి జవాబివ్వకుండా ఇద్దరికీ మంచినీళ్ళందించి, కాఫీ పెట్టడానికి లోపలికెళ్ళింది శ్రావణి.

కాలేజ్‌మేట్ సౌజన్య ఢిల్లీ వచ్చి తన్ని కలవాలని ఎంతో ఆప్యాయంగా ఇల్లు వెతుక్కుంటూ వచ్చింది. కాస్సేపు కబుర్లయ్యాక దగ్గర్లోనే ఉన్న మార్కెట్‌కి వెళ్దామనగానే తను జవాబివ్వకుండా ఊరుకుంది. కారణం మేకతోలు కప్పుకున్న పులిలాంటి భర్తకి భయపడే. కానీ ఇంతలో లోపలినుంచి భర్త రావడం, సౌజన్య పితూరీగా –

"చూడండి సుకుమార్ గారూ! మీ ఆవిడని కాస్త తోడుగా రా మార్కెట్‌కి వెళ్దాం అంటే మాట్లాడడం లేదు" అనగానే –

"అదేమిటి శ్రావణీ! పాపం మీ ఫ్రెండ్‌కి ఊరుకొత్త. కాస్త తోడెళ్ళకపోతే ఎలా? రేపు మనం వాళ్ళ ఊరెళ్తే మనకి వాళ్ళు సహాయం చెయ్యరూ! తోడు రమ్మంటే అలా బద్ధకిస్తావేమిటి?.

"చూడు! నేనూ బైటికెళ్ళాలి రాత్రికిగానీ రాను నువ్వు తనతోవెళ్ళు" అంటూ "మా ఆవిడకి బద్ధకం ఎక్కువండీ! ఇంట్లో కూడా ఇంతే అన్నీ నేనే చూసుకోవాలి. వస్తుందిలెండి. నాకు పనుంది వుంటా" అంటూ సుకుమార్ వెళ్ళిపోగానే సౌజన్య శ్రావణివైపు తిరిగి -

"ఇంత మంచిమొగుడు దొరకడం ఎంత అదృష్టమే. ఆయనంత ఫ్రీడం ఇచ్చి వెళ్ళమంటోంటే నువ్విలా మురిపిస్తున్నావేమిటే తల్లీ" అని అంటున్న మాటలకి ఏం జవాబివ్వకుండా సౌజన్యతో మార్కెట్‌కి బయలుదేరింది శ్రావణి.

ఓ గంటలో సౌజన్య తనకి కావలసిన సామాన్లు కొనుక్కుని ఆటోలో తన్ని ఇంటి దగ్గర దింపి వెళ్ళి పోయింది. రాత్రిదాకా ఇంటికి రానన్న పెద్దమనిషి ఓ గంటనుంచీ మెట్లమీద పడున్నానని చెల్లెలికి చెప్పడం, అది విన్న ఆడబిడ్డ తన్ని సాధించడం శ్రావణికి బాధనిపించి, దుఃఖంతో కళ్ళంట నీళ్ళు జలజలా రాలాయి.

ఏమిటీ మనిషి? మనిషి దగ్గరోలా మాట్లాడతారు? ఈయన మాటలు విన్నవాళ్ళు "సుకుమార్ ఎంత మంచివాడు. ఈ శ్రావణే ముంగిముషాణం" అనుకుంటారు. నిజంగా అలా మాట్లాడే నేర్పు అందరికీ వుండదు అనుకుంది.

సుకుమార్ పనిచేసేది స్త్రీ, శిశు సంక్షేమ మంత్రిత్వశాఖలో. కానీ ఇంట్లో భార్యని నోరువిప్పనివ్వడు. ఆమెకి ఆ ఇంట్లో వాక్‌స్వాతంత్ర్యంగానీ, ఆర్థిక స్వాతంత్ర్యంగానీ లేవు.

సుకుమార్ పెద్ద ఉద్యోగస్థుడే కానీ ఇంట్లో శ్రావణి చేతికి జీతం ఇవ్వడు. ధరలెంత పెరిగినా ఆమెకి ఇంటి ఖర్చుకిచ్చేది వెయ్యి రూపాయిలే. అందులోనే ఇంట్లో సరుకులు కొనడం, పనిమనిషికి జీతం, నీళ్ళ - కరెంటు బిల్లులు, పిల్లల స్కూలు ఫీజుల్లాంటివన్నీ చెయ్యాలి. ధరలు మండిపోతున్న ఈ రోజుల్లో వెయ్యిరూపాయిలు అన్నింటికీ ఎలా సర్దాలో తెలీక అవస్థపడేది.

డబ్బు సరిపెట్టాలని కూరలవంటివి తక్కువ తెస్తే అన్నం దగ్గర చిందులుతొక్కి అన్నం తినకుండా వెళ్ళిపోవడమే కాకుండా, ఇంటి కొచ్చిన ప్రతివారితో "నా భార్య పీనాసండీ. అర్ధపావు కూరకంటే మించి కొనదు" అని చెప్పి నలుగుర్లో కించపరిచేవాడు. తరుచు స్నేహితుల్ని ఇంటికి భోజనాలకి తీసుకువచ్చి స్వీట్లు చెయ్యి, హాట్లు చెయ్యి' అని ఆర్డర్లు జారీ చెయ్యడం. తెచ్చిన సరుకులు నెలకే చాలకపోతుంటే పంచదార, నెయ్యివంటి వాటితో స్వీట్లెలా చేస్తుంది? కానీ అతనికవేమీ పట్టవు.

పండగలొచ్చినా, చుట్టాలొచ్చినా, సెలవలకి ఆడబిడ్డలు, మరుదులు వచ్చినా అధికం ఓ పైసా కూడా ఇచ్చేవాడు కాదు. కానీ వచ్చిన వారికి మాత్రం రెండు

పూటలా టిఫిన్లు, కూరలతో భోజనాలు పెట్టవలసిందే. ఏ లోటు జరిగినా అందరి ఎదుటా "ఇచ్చిన జీతంలో సగం మీ వదిన చేతి దెబ్బర్రా. మిగిలిన సగం డబ్బుతో మనకింతకంటే మంచి భోజనం పెడుతుందా?" అని పెద్ద జోకేసినట్లు నవ్వడం, ఇంట్లో అంతా అతని నవ్వుతో శ్రుతి కలపడం, శ్రావణి ముఖం కందగడ్డలా ఎర్రబడిపోవడం మామూలే.

"పోనీ మీరు నెల సరుకులన్నీ తెచ్చి, మీరే అన్ని ఖర్చులూ పెట్టండి, ఖర్చు ఎంతవుతుందో మీకు తెలుస్తుంది" అని ఓ నెల అతి ధైర్యం తెచ్చుకుని భర్త దగ్గర అన్నదానికి ఆమెమీద విరుచుకుపడి –

"ఇంకా నయం అంట్లుతోమి, దొడ్డి తుడవ వద్దూ? పప్పుల దుకాణాలమ్మట, కూరల దుకాణాలమ్మట తిరిగి నా పరువు తీసుకోవాలిట. ఇంట్లో నువ్వు చేసే నిర్వాకం ఏమిటి? కూర్చుని తిని దున్నపోతులా బలవడంకాక" అంటూ రంకెలేసేసరికి మళ్లీ ఎప్పుడూ ఆ విషయం మాట్లాడలేకపోయింది.

భార్య చేతినిలా కట్టేసే సుకుమార్ తన తరపు బంధువులు వచ్చేసరికి వాళ్ళని హోటళ్ళకి, సినిమాలకి తీసుకెళ్ళడం, మార్కెట్లకి తీసుకెళ్ళి వాళ్ళు అడిగినవి, అడగనివి కొనివ్వడమే కాకుండా వందలకి వందలు వాళ్ళచేతికి, వాళ్ళ పిల్లల చేతికి ఇచ్చి "అబ్బా మా సుకుమార్ ఎంత మంచివాడో" అనిపించుకోవడంతోపాటు, వదినే పిసినిగొట్టుది" అనేలా ప్రవర్తించేవాడు.

అదే ఆమె తరుపు బంధువులు వస్తే ఇంటికొచ్చే తీరికలేనట్లు వీలైనంతసేపు ఆఫీసులో, బైట గడిపి ఏ రాత్రికో రావడం. పోనీ వాళ్ళకి తాను ఏమీ మర్యాద చెయ్యకపోతేపోయె మాట్లాడకుండా ఊరుకున్నా బాగుండేదనుకుంటే ఊరుకోక –

"శ్రావణీ! నాకెలాగూ ఆఫీసు పనితో కుదరడం లేదు. పాపం మీ వాళ్ళు రాకరాక వచ్చారు వాళ్ళని సినిమాకో, బజారుకో లేక ఏ సైట్‌సీయింగ్‌కో తీసుకెళ్ళలేక పోయావా?" అంటూ వాళ్ళెదురుగా అని,

"మీ శ్రావణి ఇంతేనండీ. ఎక్కడా సరదా, హుషారు, ఉత్సాహం లేదనుకోండి. ఢిల్లీలో ఆడవాళ్ళని చూడండి. ఎంత చలాకీగా వుంటారోను. మాలాంటి ఉద్యోగులకి తీరికలుండనప్పుడు ఇలాంటి ఊళ్ళల్లో ఆడవాళ్ళు ఆడపనీ, మగపనీ అనుకోకూడదు. మీరన్నా కాస్త నేర్పండి" అంటూ వాళ్ళ దగ్గర తన్ని చులకన చేసేవాడు.

వాళ్ళు వెళ్ళేముందు శ్రావణిని పిలిచి వాళ్ళ ఎదురుగానే "చూడు శ్రావణీ వాళ్ళు మనింటి కెందుకొస్తారు? ఇవాళ బజారుకి తీసుకెళ్ళి శుభ్రమైన బట్టలు కొని వాళ్ళకి పెట్టు. మీ వాళ్ళ టేస్టులు నీకు తెలుస్తాయి" అనేవాడు.

ఇటు వచ్చిన చుట్టాలకి సరైన తిండి పెట్టడానికే డబ్బులు సరిపోక సతమతమవుతుంటే అటు బట్టలెలా కొంటుంది? డబ్బు ఎక్కడినుంచి తెస్తుంది?? ఆ మాటలు విన్న బంధువులు కొందరు శ్రావణి ఓ రవికలబట్ట పెట్టి పంపిస్తే ఆమె పిసినిగొట్టుతనాన్ని, అతని దర్జాస్వభావాన్ని చాటుగా చెప్పుకుంటే, మరికొందరు ఆమె ఎదురుగానే అనేసేవారు.

పుట్టింటికెళ్ళినప్పుడు తన వాళ్ళు పెట్టే చీరలు, ఎవరన్నా చేతిలో పెట్టే డబ్బూ దాచుకుని, భర్త అలా అన్నవాళ్ళకి పెట్టినట్లయితే వాళ్ళు వెళ్ళనిచ్చి ఆ డబ్బు నా జేబులోంచి తీసి కొన్నావు లేదంటే ఎలా వచ్చిందనో, లేదా నెలకిచ్చే డబ్బులో సామాన్లు కొనకుండా దాచుకుని చాలటంలేదని అబద్ధాలాడుతున్నావనో గొడవ చేసేవాడు.

ఆఫీసులో తోటి ఉద్యోగస్తుల ఇళ్ళకి పార్టీలకి పిలిస్తే "మంచి బట్టలేసుకో" మనేవాడు. తనకీ, పిల్లలిద్దరికీ పుట్టింటివారు కొనిపెట్టే బట్టలు తప్ప ఎప్పుడూ పిల్లలకన్నా సరదాకి ఏమీ కొనేవాడు కాదు. ఉన్న బట్టల్లోనే మంచివి వేసుకున్నా తన తాహతుకి ఆ బట్టలు తగవని తన ఫ్రెండ్సు భార్యాపిల్లలు వేసుకునే బట్టలు చూసి సిగ్గు తెచ్చుకోమని ఎగిరేవాడు. అతనలా మండిపడుతున్నా ఎదిరించి అడగడానికి శ్రావణికి ధైర్యం ఏదీ? ఒకవేళ అడిగిందా - ఇక ఆమె సంగతి అంతే!

శ్రావణి కాపురానికొచ్చి పదేళ్ళు దాటింది. భర్త ప్రవర్తన ఆమెని రానురాను విసిగించి, పిచ్చిదాన్ని చేసేస్తోంది. అందరికీ అతనెంతో మంచివాడు. నెమ్మదస్తుడు, సరదా అయినవాడు. అందుకు పూర్తిగా వ్యతిరేకి ఇంట్లో భార్యపట్ల.

భార్యని ఒక శత్రువుని చూసినట్లు చూసేవాడు. ఆమె గురించి ఎప్పుడూ తక్కువగానూ, నీచంగానే ఆలోచించేవాడు. తన అవసరాలకి వాడుకుంటూ, పనిమనిషిని చూసినట్లు చూసేవాడేతప్ప భార్యకివ్వవలసిన గౌరవం, ఆప్యాయత, అభిమానం ఎన్నడూ కనబర్చలేదు.

ఏం మాట్లాడినా అందులో చెడు భావాన్నే తీసేవాడు. ఏం చెప్పినా అతి తప్పుని ఖండించేవాడేతప్ప మంచిగా ఎప్పుడూ ఆలోచించేవాడు కాదు. అదే మాట ఎదుటివాళ్ళు చెప్పగానే వెంటనే వినడం, చెయ్యడం కూడా చేసేవాడు.

భార్య దగ్గర చాలా జాగ్రత్తగా వుండాలి, ఏ మాత్రం లోకువ ఇచ్చినా నెత్తెక్కి తొక్కి లోకువ చేస్తుంది. తన డబ్బంతా తినేస్తుంది లేదా పుట్టింటికి దోచేస్తుందిలాంటి భావాలని పెళ్లయిన నాటినుంచి మనసులో పెంచుకోవడమేకాదు, ఆ భావాలకి ఉగ్గుపాలుపోసి పెంచుతూ, ఆ ఆలోచనలతోటే శ్రావణిపట్ల ప్రవర్తించేవాడు.

ప్రతీ క్షణం మాటలతో హింసించి ఆనందపడే వాడు. అనుమానంతో వేధించేవాడు.

కాపురానికి వచ్చిన కొత్తలో అక్కడక్కడ డబ్బులు పడేసి శ్రావణి ప్రవర్తనని కనిపెట్టేవాడు. అలా పెట్టిన నోటు ఓ రోజు గాలికెగిరి బీరువా వెనకపడితే "నువ్వే తీసా"వంటూ నిందించాడు. పనిమనిషి ఇల్లు తుడుస్తూ ఆ నోటు బీరువాకింద దొరికిందని తెచ్చి ఇస్తే నీ దొంగతనం బైటపడిపోయిందని బీరువా వెనక్కి పడేశావని నిందించాడే తప్ప ఆమె మాటల్ని నమ్మలేదు.

ఏ వ్యక్తికైనా ఓర్మీ, శాంతానికీ హద్దులుంటాయి. పదేళ్ళపాటు ఈ మానసిక హింసకి గురైన శ్రావణికి ఇక భరించే శక్తి సన్నగిల్లసాగింది.

నెమ్మదస్తురాలైన ఆమె తన వాళ్ళతో కూడా భర్త ప్రవర్తన గురించి చెప్పకపోవడంతో ఆమె వాళ్ళంతా కూడా "శ్రావణి పట్నవాసం జీవితానికి అలవాటుపడలేకపోవడంవల్ల అతనలా అంటా"డని, "డబ్బు సరిగ్గా, జాగ్రత్తగా ఖర్చుపెట్టడం రాక సంసారం సరిగ్గా చేసుకోలేకపోతో౦"దనీ అనుకునేవారే తప్ప, లోపల లోపల అతను ఆడే కత్తిపోట్ల లాంటి మాటల హింసల్ని తెలుసుకోలేకపోయేవారు.

సెలవలకి పుట్టింటికొచ్చిన కూతుర్ని తల్లీ, తండ్రీ కూర్చోపెట్టుకుని చెప్పబోతున్న నీతులు ఈసారి శ్రావణి వినలేక, ఇన్నేళ్ళుగా తాను పడుతున్న మానసిక హింసల్ని, ఇక దాచుకోలేక, సముద్ర గర్భంలో ఉన్న అగ్నిపర్వతం బద్దలై, పైకి తన్నుకొచ్చిన లావాలా దుఃఖం పెల్లుబికిరాగా, ఇన్నేళ్ళూ మానసిక వేదనతో తనెలా కుమిలిపోతున్నదీ తల్లిదండ్రులకి చెప్పుకుని దుఃఖించసాగింది.

"అమ్మా! భర్త ఇంట నవ్వని స్త్రీని చూశారా? పొరపాటున ఆయన ఎదుట నవ్వినరోజు ఆ రాత్రిలోగా ఏదో విధంగా హింసించి ఏడిపించి ఆనందపడే నా భర్తలాంటి వాడితో పదేళ్ళు కాపురం చేశానమ్మా! ఊరికే కూర్చుంటే సహించలేక ఏదో పని కల్పించి చెప్తారు లేదా వంటింట్లోకెళ్ళి నెయ్యో, నూనో ఒలకబొయ్యడం, ఏ నీళ్ళో తన్నెయ్యడంలాంటివి చేసి తుడవమంటారు.

"అన్నం తింటున్నపుడు కూడా నన్ను పదిసార్లు లేవదీసి అక్కడ లేనివి తెమ్మంటారు. స్థిమితంగా అన్నం తినడం, నిర్మలంగా నిద్రపోవడం కూడా సహించలేరు. ఎవ్వరొచ్చినా మాట్లాడకూడదు. ఆయన కళ్ళకేసి చూస్తూ అనుక్షణం ఆయన కనుసౌజ్ఞలలో మెలగాలి.

"ఇంటి కొచ్చినవారి దగ్గర నా మీద ఎంతో ప్రేమ ఒలకబోస్తూ మాట్లాడతారు. వాళ్ళ ఎదురుగా నా చేత ఏవో అడిగి మాట్లాడించడం, మాట్లాడకపోతే తప్పు మాట్లాడితే వాళ్ళు వెళ్ళాకా ఆడిన ప్రతీ మాటకీ వ్యతిరేకార్థం తీసి నానా మాటలు ఆడడం.

బైటివాళ్ళు మీ వారికి మీరంటే ఎంత ప్రేమండీ! అనేలా మాట్లాడుతూనే నన్ను చెడ్డదాన్ని చేస్తారు. నే చేసే ప్రతీ పనిలో ఎంతో తెలివిగా చెడుని, లోపాలని ఎత్తి ఎదుటివాళ్ళకి చూపిస్తారు. ఊరందరికీ, చుట్టాలకీ ఆయనెంతో ఉత్తముడు. నేను పిసినారిని, డబ్బు దాచుకునే దొంగని, ఇంటికొచ్చేవారికి సరైన మర్యాదచెయ్యని దుర్గార్గురాలిని.

ఇప్పుడు చెప్పండి నాన్నగారూ! అలాంటి భర్తతో ఎలా కాపురం చెయ్యాలో? కొత్తలో ఆయనకి జవాబివ్వబోయినప్పుడు కొట్టడానికి కూడా సిద్ధపడి వేసిన కేకలకి గుండెదడ వచ్చి మళ్ళీ ఈనాటి వరకు ఆయనకి ఏమీ జవాబివ్వకుండా అన్నీ సహిస్తూ వచ్చాను. ఇక భరించే శక్తి నాకు లేదు నాన్నగారూ! నాకిక నీతులు చెప్పొద్దు. కొన్నాళ్ళకి నాకు పిచ్చెక్కిపోతుంది అమ్మా" అంటూ తల్లి ఒడిలో తలపెట్టుకుని దుఃఖిస్తున్న కూతుర్ని ఎలా ఓదార్చాలో అర్థంకాక –

"ఇన్నేళ్ళపాటు ఆ అగ్నిపర్వతాన్ని గుండెల్లో దాచుకుని ఎలా తట్టుకుందో" అనుకుని జాలితో గిలగిల్లాడారా దంపతులు.

కూతుర్ని అక్కున చేర్చుకుని "మేం బతికున్నామని మర్చిపోయావా తల్లీ ! ఇన్నేళ్ళూ ఆ బాధల్ని ఎలా మనసులో దాచుకున్నావమ్మా! తల్లీ, తండ్రీ అన్నాక కష్టమప్పుడు బిడ్డల్ని ఆదుకోడానికేకదమ్మా! మాకు ఏ ఒక్క విషయం తెలీక నీకు ఏదో చెప్పబోయామమ్మా" అంటూ ఊరడించింది తల్లి.

"ఏ తల్లీ, తండ్రీ కూడా బిడ్డల కాపురాలు విచ్ఛిన్నం చేయరు. సహనానికి శాంతానికి మారుపేరు స్త్రీ. ఓర్పు, నేర్పులతో సంసారాన్ని చక్కదిద్దుకోమని కూతుళ్ళకి చెప్తారు. మితిమీరిన బాధలకి గురైనప్పుడు మా అండ వుందని ఆదుకోడం తల్లిదండ్రుల కర్తవ్యం తల్లీ" అంటూ ఊరడించాడు తండ్రి.

విశ్వనాథంగారు అల్లుడికి ఎలా బుద్ధిచెప్పాలో ఆలోచించసాగాడు. ఇలాంటి శాడిస్టుల్ని అలా వదిలేసినా, వారి ప్రవర్తనని అరికట్టకుండా భరిస్తూ వచ్చినా తమ తప్పుల్ని వారు తెలుసుకోరు.

భార్యని చెప్పుకింద రాయిలా అణిచేసి తను ఒక మహనీయుడిలా నటించడంకూడా ఒక ఆర్టే. భర్త గౌరవించని స్త్రీని ఆ ఇంటి దాసీమనిషి కూడా గౌరవించదు. అదే జరుగుతోంది శ్రావణిపట్ల. ఆ ఇంట్లోనే మిగిలిన అన్నదమ్ముల భార్యల్ని వారివారి భర్తలు ఎంతో అపురూపంగా, ప్రేమగా చూసుకుంటూ వారంతా శ్రావణిని చులకనగా మాట్లాడుతున్నారంటే తప్పెవరిది? లోపం ఎక్కడ?? ఆ ఇంటి మగవాడిదేకదా? అనుకుంటూ శ్రావణి కష్టాలకి విముక్తిమార్గాన్ని ఆలోచించసాగాడు.

విశ్వనాథంగారికి శ్రావణి, శ్రీమంత్‌లిద్దరే సంతానం. ఇద్దర్నీ మంచి శిక్షణలో పెంచారు. శ్రావణికి బి.ఇడి. చెప్పించి పెళ్ళిచేశారు. శ్రీమంత్ ఇంజినీరింగ్ పూర్తిచేసి ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేసుకుంటున్నాడు.

ఇద్దరికీ పెళ్ళిళ్ళు చేసి, వారి జీవితాలు హాయిగా గడిచిపోతున్నాయని ఆనందపడేవారు.

తాను రిటైరై వచ్చే పెన్షన్‌తో నిశ్చింతగా కాలం వెళ్ళబుచ్చుతున్నాడు.

విశ్వనాథంగారు ఓ కంపెనీకి జనరల్ మేనేజర్‌గా పనిచేసి నలుగుర్లో మంచి పేరు సంపాదించిన వ్యక్తి.

పెళ్ళైన పదేళ్ళ తరువాత కూతురొచ్చి చెప్పిన విషయాలు విన్నాక భార్యలా తను గోలపెట్టలేదు. ఆలోచనల్ని అమలుపర్చాడు.

శ్రావణి పుట్టింటికెళ్ళి పదిహేను రోజులు దాటింది. పది రోజుల్లో తిరిగి వచ్చెయ్యమని ఆదేశించి మరీ పంపాడు సుకుమార్. ఎప్పుడూ తను రమ్మన్నరోజుకి నిమిషం లేటుచెయ్యకుండా వచ్చేసే శ్రావణి ఈసారి రాకపోవడంతో సుకుమార్ కాళ్ళకి నిప్పులు రాసుకున్నట్లు తిరిగేస్తున్నాడు.

పుట్టింటికి వెళ్ళిన శ్రావణే చేరిన వెంటనే, ఆ తరువాత రెండేసి రోజులకో ఉత్తరం చొప్పున రాయాలి. వాటికి బదులు రాయడం అతనికి నామోషీ. వెళ్ళేటప్పుడే వచ్చే తారీకు భర్త నిర్ణయించడంతో ఆమె తిరుగు ప్రయాణానికి టిక్కెట్టు వెళ్ళగానే కొనేసేది.

అలాంటిది ఇంకో వారం గడిచింది. పిల్లల స్కూళ్ళు కూడా తెరిచేశారు. శ్రావణి రాలేదు. దానికి తోడు ఊళ్ళో అందరూ "మీ ఆవిడింకా రాలేదేమిటీ?" అని అడగడం చాలా అవమానంగా ఫీలైపోతున్నాడు. భార్య ఇంటికొస్తే ఎలా బుద్ధిచెప్పాలో ఎలా తిట్టాలో రెడీ చేసుకుని వుంచుకున్నాడు. జన్మలో మళ్లీ ఇలాటి తప్పు చెయ్యకుండా హడలకొట్టాలనుకున్నాడు.

రావలసిన టైముకి నెల్లాళ్ళు దాటిపోయింది. కనీసం కారణం ఏమిటో ఉత్తరంకూడా రాయలేదు. సుకుమార్ మనసు కుతకుతా ఉడికిపోతోంది. అన్నిటికంటే తలవంపులు స్నేహితులు, ఇరుగుపొరుగులు ఎదురుపడినప్పుడల్లా –

"స్కూళ్ళు తెరిచేశారు. మీ ఆవిడా, పిల్లలూ ఇంకా రాలేదేమిటీ? ఎప్పుడొస్తారు?" అని అడగడం, మరీ దగ్గర మిత్రులైతే "మీ మధ్య ఏమన్నా గొడవలొచ్చాయేమిట్రా?" అని కూడా అడగడం తలకొట్టేసినట్లవుతోంది.

చూసి చూసి ఓ రోజు 'స్టార్ట్ ఇమిడియట్లీ' అంటూ భార్యకిచ్చిన టెలిగ్రాముకి కూడా శ్రావణి రాకపోవడం అటుంచి ఎటువంటి జవాబు కూడా ఇవ్వకపోవడంతో అతని మనసు ఏసిడ్ రాసుకున్నట్లు మండిపోసాగింది.

"ఆఫ్టరాల్ ఓ ఆడది – ఇన్నేళ్ళూ భయభక్తుల్లో పెట్టి నా కంట్రోల్‌లో వుంచాను. నోరెత్తడానికి గజగజలాడేది, అలాంటిది ఈ రోజు నా మాటన్నా, నా టెలిగ్రామన్నా లెక్క లేకుండా ప్రవర్తిస్తోందా?" అంటూ పళ్ళు నూరుకోసాగాడు.

ఏంచెయ్యాలో అర్థంకావడంలేదు. పట్టుదల, పౌరుషం, ఆహం తిక్క పెరిగిపోతున్నాయి. శ్రావణి కనపడగానే పీక నులిమెయ్యాలన్నంత కోపం వచ్చేస్తోంది. కానీ ఏం చెయ్యలేని నిస్సహాయత. దాంతో కోపం రెట్టింపవుతోంది.

స్నేహితుడితో ఆఫీసు నుంచి ఇంటికొచ్చిన సుకుమార్‌కి శ్రావణి దగ్గరనుంచి వచ్చిన కవరు కనపడి గబగబా విప్పి ఆత్రుతగా చదవసాగాడు.

"సుకుమార్ గారికి

"నేను నెల్లాళ్ళక్రితం ఇక్కడ ఓ పబ్లిక్‌స్కూల్లో టీచరుగా చేరాను. సుమారు నాలుగువేల దాకా నెలకి జీతం వస్తోంది. మా నాన్నగారు మా అన్నయ్యతో సమానంగా నాకు తన మేడ, పొలం రాసి ఇచ్చారు. ప్రస్తుతం నా వాళ్ళతోటే నేను నా ఇంట్లో వుంటున్నాను.

పిల్లల్ని నేను పనిచేసే స్కూల్లోనే చేర్పించాను. నాకు ఇంటద్దె లేదు. నా తండ్రిని కూడా అడక్కుండా నా జీతంతో హాయిగా దర్జాగా బతుకుతున్నాను. జీవితంలో ఇన్నేళ్ళూ పోగొట్టుకున్న స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలని నా తండ్రి ఇచ్చిన మద్దతు ధైర్యంతో తిరిగి సంపాదించుకున్నాను. ఆయనే ఈ ఉద్యోగం వేయించారు.

ఇప్పుడు సుఖంగా, ఏ బెంగా లేకుండా, నిశ్చింతగా బతుకుతున్నాను. పదేళ్ళుగా మూగదానిగా మారి, మాటలు మర్చిపోయిన నేను సాయంకాలం ఇంటికి రాగానే నా వాళ్ళందరిలో కూర్చుని తృప్తి తీరా కబుర్లు చెప్పుకోవడమే కాకుండా, మనసారా నలుగుర్లో నవ్వుకుంటూ తినే పప్పన్నమే నాకెంతో బలాన్నీ, ధైర్యాన్నీ ఇస్తోంది.

ఇన్నేళ్ళుగా పరువు, మర్యాదల చాటున భరించిన మానసిక వ్యధని నా తల్లిదండ్రులకి కూడా చెప్పుకోక పోవడం ఎంత పొరపాటుచేశానో, దానివల్ల నా జీవితంలో ఎంతటి ఆనందాన్ని కోల్పోయానో, ఇప్పుడు తెలుసుకున్నాను.

'భార్య మాట వినకూడదు. భార్య చేతికి డబ్బివ్వకూడదు. మీరేం మాట్లాడినా నోరెత్తకూడదు. నేనేం మాట్లాడినా, ఏం చేసినా నోరు మూసుకుని పడుంటుంది. ఏం చెయ్యదు చెయ్యలేదు' అన్న మొండిధైర్యం మీలో ప్రబలిపోయి నా పట్ల మీరు నలుగురిలో ప్రవర్తించే తీరు నన్ను విసిగించేసింది.

అడకత్తెర మధ్య పెట్టి చావకుండా, బతక్కుండా భార్య అనే ఒక ప్రాణిని ఎలా నలపాలో మీకు చేతనైనట్లు చాలా కొద్దిమందికే చేతనవుతుంది. ఇన్నాళ్ళూ నన్ను

నలుగురిలో చెడ్డదానిగా చూపించారు. ఇకముందు మొగుడిని వదిలేసిన ఆడదాన్నన్న బిరుదు కూడా ఇవ్వండి.

ఏ ఆడదీ కూడా ఆత్మగౌరవాన్ని చంపుకుని ఎంతకాలం బతకగలుగుతుంది? ఇక ఓర్చుకునే శక్తి నాలో నశించింది. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాను.

సరే గడచినది పీడకలగా మర్చిపోవడం మంచిది. ఇక నేనా నరకంలోకి రాదల్చుకోలేదు. ఏ మనిషికన్నా కావలసింది ఆప్యాయత, అనురాగం, స్వేచ్ఛ. ఇవి కొదవైనప్పుడు ఆ మనిషి విసిగిపోయి నాలాగే తయారవుతుందన్న నిజాన్ని తెలుసుకుని ఇకముందన్నా మసులుకోండి.

భార్య కూడా మీ తల్లీ, తోబుట్టువులవంటి స్త్రీయే అని గుర్తుపెట్టుకోవడమే కాకుండా, మీరు చేస్తున్న ఉద్యోగానికి న్యాయం చేకూర్చమని కోరుకుంటున్నాను. ఈ విషయాలన్నీ రాయడానికే మీకీ ఆఖరి ఉత్తరం రాస్తున్నాను.

ఉంటా- శ్రావణి"

అన్న ఉత్తరాన్ని చదువుకుని చిల్లుపడ్డ బుడగలా సోఫామీదకి కూలబడిపోయిన సుకుమార్‌ని పక్కనున్న స్నేహితుడు చూసి "ఏమయిందిరా? ఏదన్నా బేడ్ న్యూసా?" అంటూ ఉత్తరం అందుకుని చదివి -

"ఓరి. ఇదిరా నీ అసలు రూపం?!" అన్నదానికి వెర్రివాడిలా చూస్తూ - "ఇక నా పని అయిపోయింది. వీడిద్వారా ఈ నిజం ఊరంతా తెలిసిపోతుంది. ఇన్నేళ్ళూ దాగిన తన గుట్టు రట్టవుతుంది. తన పరువింక వీధినపడింది.

నలుగురు హేళనచేసి నవ్వుతారు. ఇన్నాళ్ళూ ఎంతో మంచివాడినని నమ్మించడమే కాకుండా పరువే ప్రాణంగా నమ్ముకుని బతికాను. ఈరోజు నుంచి నా పరువు బజారుపాలవడమే కాదు, నా బాధలు భరించలేక పెళ్ళాం వదిలేసిందన్న మచ్చ కూడా వస్తుంది" అనుకుని అవమానంతో క్రుంగిపోసాగాడు.

చేయి దాటిపోయాక చేసిన తప్పెలా దిద్దుకోవాలో తెలీటంలేని సుకుమార్ సిగ్గు, బాధతో స్నేహితుడి చేతుల్లో ముఖం దాచుకుని -

"శ్రావణి పట్ల చాలా మూర్ఖంగా ప్రవర్తించానురా! చాలా ఉత్తమురాలురా! నా పరువు కాపాడి, నాకేదన్నా మార్గం చూపరా" అంటూ బాధవడసాగాడు.

స్వాతి మాసపత్రిక

జులై **1996**